రైతుబజార్ కష్టాలు తీరేదెన్నడు?

శాశ్వతంగా ఉన్న రైతుబజార్ కూల్చడంతో ఇక్కట్లు

- మూడేళ్లుగా షెడ్లలోనే నిర్వహణ
- నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు
- తాత్కాలిక మరమ్మతులకు హామీ ఇచ్చినా కానరాని ఫలితం



తాత్కాలిక షెడ్లలో కొనసాగుతున్న కొత్తగూడెంలోని రైతుబజార్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం చుట్టుపక్కల మండలాల్లో పండించిన పంటలను తెల్లవారుజామునే రైతుబజార్‌కు తీసుకొచ్చి అమ్ముతూ కుటుంబాలను పోషించే రైతులు అనేక మంది ఉన్నారు. జూలూరుపాడు, సుజాతనగర్, కాకర్ల, నర్సింహసాగర్, రాఘవాపురం, బేతాలపాడు వంటి ప్రాంతాల నుంచి ఎక్కువగా రైతులు కూరగాయాలు, ఆకుకూరలను కొత్తగూడెంలోని రైతుబజార్‌కు తీసుకొచ్చి విక్రయిస్తారు. అయితే, ఆధునికీకరణ పేరుతో 30 ఏళ్లకుపైబడి కూడా చెక్కు చెదరకుండా ఉన్న రైతుబజార్‌ను కూల్చివేసి, ఆ స్థలంలో మూడేళ్ల కిందట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని గత ప్రభుత్వం ప్రారంభించింది. రైతుబజార్ కూల్చడంతో రైతుల కోసం తాత్కాలికంగా రూ.10 లక్షలను కేటాయించి షెడ్లను నిర్మించారు. అయితే, నాసిరకంగా పనులు జరగడంతో రైతులు తాత్కాలిక షెడ్లలోనే వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ, చలికి వణుకుతూ కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. ఇక ఈ షెడ్లలో రక్షణ లేక రాత్రి వేళ కూరగాయలకు భద్రత కరువైంది. ఈ విషయాన్ని ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండాపోతోంది. వినతులు అందినప్పుడు అధికారులు అక్కడికి వచ్చి పరిశీలించడం, హామీలు గుప్పించి వెళ్లిపోతున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యాపారులు మరింత ఆందోళన చెందుతున్నారు. తాత్కాలిక షెడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానిక ఎమ్మెల్యేతో పాటుగా మున్సిపల్ కమిషనర్‌ను వ్యాపారులు ఇటీవల కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ క్రమంలో మూడు రోజుల కిందట మున్సిపల్ కమిషనర్ రైతుబజార్ తాత్కాలిక షెడ్లను పరిశీలించి, మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారని రైతుబజార్ వ్యాపారులు చెబుతున్నారు.

పట్టా కప్పితే పనికి రాదు..

రైతుబజార్‌లోని వ్యాపారులకు మూడేళ్ల కిందట తాత్కాలిక రేకుల షెడ్లను నిర్మించారు. ప్రస్తుతం షెడ్లకు సంబంధించిన రేకులన్నీ కొట్టుకుపోయాయి. ఉన్న కొన్ని రేకులు కూడా ఎప్పుడు కూలిపోతాయో తెలియడం లేదు. దీంతో వర్షానికి నీరు దుకాణంలోకి రాకుండా వ్యాపారులు తాత్కాలికంగా పట్టాలు కప్పుకున్నారు. అయితే, ఇటీవల రైతుబజార్ షెడ్లను పరిశీలించిన మున్సిపల్ అధికారులు షెడ్లపై ప్లాస్టిక్ పట్టాను కప్పి వర్షపు నీరు పైనుంచి దుకాణంలోనికి రాకుండా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చినా ఇంకా పనులు మొదలుకాలేదు. అయితే, పట్టా కప్పి చేతులు దులుపుకోకుండా ప్రస్తుతం ఉన్న షెడ్లకు రేకులను కొంత ఎత్తులో ఏర్పాటు చేసి అప్పుడు ప్లాస్టిక్ పట్టాలను ఏర్పాటు చేస్తే ఇంకొంతకాలం ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. అలాగే, వర్షపు నీరు షెడ్లలోకి రాకుండా చూడాలని, రాత్రి వేళ్లలో కూరగాయలు, ఇతర వస్తువులకు రక్షణ ఉండేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. మరోపక్క ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ప్రస్తుతం నిలిచిపోయాయి. ఆ పనులు ఎప్పటికి పూర్తవుతాయో, రైతుల కష్టాలు ఎప్పుడు తీరుతాయో తెలియడం లేదు.

ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయిస్తాం



రైతుబజార్ తాత్కాలిక షెడ్లను పరిశీలించాం. వర్షపు నీరు షెడ్లలోకి రాకుండా తగిన ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్లాస్టిక్ పట్టా కప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయిస్తాం.

–శేషాంజన్‌స్వామి, మున్సిపల్ కమిషనర్, కొత్తగూడెం

రేకుల ఎత్తు పెంచాలి..



కొత్తగూడెంలోని తాత్కాలిక రైతుబజార్ రేకుల షెడ్లకు సంబంధించి ఎత్తు పెంచి నూతనంగా రేకులను ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. అధికారులు ప్లాస్టిక్ పట్టాను కప్పితే సమస్య పరిష్కారం కాదు. ప్రస్తుతం షెడ్లలో రేకులు, పట్టా ఎత్తు తక్కువ ఉండటం వల్ల గాలి రాక, ఉక్కపోతతో అవస్థలు పడుతున్నాం.

–పి.రమేశ్, ఆకుకూరల వ్యాపారి

శాశ్వతంగా పరిష్కరించాలి..



రైతుబజార్ తాత్కాలిక షెడ్లలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎండ, వాన, చలి అన్ని కాలాల్లో అవస్థలు తప్పడం లేదు. ఇంటిగ్రేటెడ్ నిర్మాణం అని మంచిగా ఉన్న శాశ్వత రైతుబజార్‌ను తొలగించి కష్టాలపాలు చేశారు. ఇంటిగ్రేటెడ్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి. లేకుంటే రైతుబజార్ వ్యాపారులకు శాశ్వత పరిష్కారం చూపాలి.

–ఆర్.వెంకటరమణ, కూరగాయల వ్యాపారి

వర్షపు నీరు లోపలికి వస్తోంది



వర్షం పడినప్పుడల్లా నీరు రైతుబజార్ తాత్కాలిక షెడ్ల లోకి వస్తోంది. పైన రేకులు కొట్టుకుపోయి ఉండటం, ప్లాస్టిక్ పట్టా చిరిగిపోవడంతో పైనుంచి వర్షపు నీరు, నేలపై ఎగువప్రాంతం నుంచి రైతుబజార్ తాత్కాలిక షెడ్లలోకి నీరు రావడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

–డి.వెంకటరమణ, కూరగాయల వ్యాపారి

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జితేష్ వి పాటిల్‌ను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీతారామ ప్రాజెక్టు, రైల్వే నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, జిల్లాలో ఉన్న ఇతర సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా ఉన్నారు.

నూతన గనులకు అనుమతులు ఇప్పించాలి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బీఎంఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలో వీకే–7 ఓసీ, రాంపురం భూగర్భగనికి అనుమతులు ఇప్పించాలని బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సోమవారం కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మాధవ్‌నాయక్, యాదగిరి సత్తయ్య, పవన్‌కుమార్, నాగప్రసాద్, కాసర్ల మోహన్, శ్యామ్ పాల్గొన్నారు.

మండలవాసికి ఐఐటీలో సీటు



బోడా ప్రశాంత్

జూలూరుపాడు: మండలంలోని గుండ్లరేవుకు చెందిన బోడా ప్రశాంత్ ఐఐటీలో సీటు సాధించాడు. ప్రశాంత్ జేఈఈ మెయిన్స్‌లో 99.25 శాతం, అడ్వాన్స్‌డ్‌లో 347 ర్యాంకు సాధించి మద్రాస్ ఐఐటీలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో సీటు సాధించాడు. ప్రశాంత్ తండ్రి గోపాల్, తల్లి లక్ష్మీబాయి ప్రభుత్వ ఉపాధ్యాయులు.

రైళ్ల రాకపోకలు పునరుద్ధరించాలి

ఇల్లెందు: సికింద్రాబాద్ – విజయవాడ మధ్య రైళ్ల రాకపోకలు పునరుద్ధరించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఇల్లెందు పట్టణ కార్యదర్శి యాకుబ్ షావలి సోమవారం డిమాండ్ చేశారు. కరోనా కాలంలో రద్దు చేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరించకపోవడం వల్ల సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. కేంద్ర మంత్రులు, ఎంపీలు తక్షణం రైళ్ల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఐకి శుభాకాంక్షలు

ఇల్లెందు: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం నేతలతోపాటు తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఇ.మొగిలి సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ సందీప్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అర్వపల్లి రాధాకృష్ణ, ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, నరేంద్రుల అను, పల్లెర్ల చంద్రశేఖర్ పసుమర్తి వాసు, బసవయ్య, కటకం బాలకృష్ణ, గొరిశెట్టి నగేశ్, నాగరాజు, చందా చక్రధర్, గందె సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ సెల్ అధ్యక్షుడికి సత్కారం

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ఐఎన్‌టీయూసీ నాయకులు సాధం రామకృష్ణను సోమవారం డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు జాలే జానకీరెడ్డి, కొండెం వెంకన్న, కాల్వ భాస్కర్, కాపర్తి వెంకటాచారి, గంగుల భువనసుందర్‌రెడ్డి, బత్తుల వెంకటేశ్వరరావు, వాసుమల్ల సుందర్‌రావు, అనిత, కందుకూరి రాము, భరత్, చాంద్‌పాషా, కిషన్, నందా నాయక్, బాలాజీ, చారి పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో సత్తా



బాణోత్ గణేశ్

టేకులపల్లి: ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం విడుదల కాగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులు సత్తా చాటారు. ఎంపీసీ గ్రూపులో బాణోతు గణేశ్ 470/465, బైపీసీ విభాగంలో ఎ.ఇందు 440/355, బి.నందిని 440/350 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు.

కార్మికుల హక్కులు కాలరాస్తే సహించేదిలేదు

సింగరేణి(కొత్తగూడెం): కార్మికుల హక్కులు కాలరాస్తే ఊరుకునేది లేదని, హక్కుల రక్షణకు పోరాటాలు ఉధృతం చేస్తామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ తెలిపారు. కొత్తగూడెంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్తం చిందించి, త్యాగాల పునాదులపై సాధించుకున్న హక్కులను నరేంద్రమోదీ కాలరాసేందుకు చేసే ప్రయత్నాలను అడ్డుకుంటామని తెలిపారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లను అందరూ వ్యతిరేకించాలని కోరారు. సమావేశంలో నాయకులు మోత్కూరి మల్లికార్జున్‌రావు, గొని నాగేశ్వరరావు, సంజీవ్, నాగమ్మ, మణెమ్మ, శంకర్, నాగమణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

జూలూరుపాడు: కార్మికుల సంక్షేమానికి వ్యతిరేకంగా ఉన్న లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు కూరాకుల నరసింహారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు 26న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ రూపొందించిన కరపత్రాలను సోమవారం ఆయన జూలూరుపాడులో ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్లుగా మార్చిన నేపథ్యాన కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న ధర్నాకు కార్మికులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు ఇరప వెంకన్న, కార్మికులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడి మృతికి సంతాపం

టేకులపల్లి: ఐఎఫ్‌టీయూ అనుబంధ తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు నీల అర్జున్ యాదాద్రి భువనగిరి జిల్లా రాజుపేట మండలం దూది వెంకటాపురంలో మృతి చెందగా పలువురు నాయకులు సంతాపం ప్రకటించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ఆయన పాటుపడ్డారని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాదంశెట్టి నాగేశ్వరరావు, జి.అనురాధ తదితరులు ఒక ప్రకటనలో గుర్తు చేశారు. ఈ మేరకు ఆయన మృతిపై యూనియన్ తరఫున సంతాపం తెలిపారు.

పోడు హక్కులు కల్పించడమే లక్ష్యం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

పాల్వంచరూరల్: పేదరైతుల సాగులో ఉన్న పోడు భూములకు హక్కులు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి క్రాస్‌రోడ్డులో సోమవారం నిర్వహించిన సమావేశంలో వజ్జ వాసు, వజ్జ కృష్ణ, మహంకాళి తిరుపతిరావు ఆధ్వర్యాన పలువురు సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పోడు సాగు చేసుకుంటున్న నిరుపేద రైతులకు భూమిపై హక్కులు కల్పించేలా పనిచేస్తానన్నారు. ఈ విషయంలో అటవీశాఖ అధికారుల కవ్వింపు చర్యలు మానుకోవాలని, పోడు భూముల జోలికి వస్తే సహించబోమని హెచ్చరించారు. సీపీఐ నాయకులు ముత్యాల విశ్వనాథం, ఎస్‌కే సాబీర్‌పాషా, విసంశెట్టి పూర్ణచందర్‌రావు, చంద్రగిరి శ్రీనివాస్, రేసు మల్లయ్య, ఉప్పుశెట్టి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి మండలం ఉమ్మడి రేగళ్ల పంచాయతీ గిరిజనులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నవరపు సత్యనారాయణ మాట్లాడుతూ.. అర్హులైన గిరిజనులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని హైకోర్టు చెప్పినప్పటికీ కౌంటర్ ఇవ్వడంలో రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాప్యం చేస్తున్నారన్నారు. రేగళ్ల ఉమ్మడి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 122, 123, 14లలో ఉన్న భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కొన్నేళ్లుగా ఆ ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారని, ఫారెస్ట్, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక సర్వే చేపట్టి అర్హులైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారని, కానీ కొందరికే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు గుగులోత్ రూప్లానాయక్, వాంక్‌డోత్ కోబల్, బానోత్ శ్రీను, అజ్మీరా మోహన్, భూక్య కిషన్, ధరావత్ శ్రీను, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ ఐసీడీఎస్‌లో 1975 నుంచి గౌరవ వేతనం పేరుతో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారని, చాలీ చాలని వేతనం పొందుతూ కుటుంబ పోషణ భారం అవుతోందని తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, గోనె మణి, రెడ్డి అరుణ, వి.మల్లికార్జున్, అనుముల సాయి, పాయం రత్నకుమారి, రూప, సరోజ, కనకమ్మ, కృష్ణవేణి, మాధవి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

ఇల్లెందురూరల్/ఇల్లెందు: జాతీయ నూతన విద్యా పథకంలో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యా ప్రణాళికకు సంబంధించి అంగన్‌వాడీ టీచర్లకు ఈసీసీఈ శిక్షణను ప్రారంభించారు. సోమవారం సంజయ్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇల్లెందు అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలోని టీచర్లకు మూడు రోజుల పాటు మూడు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ ఇస్తున్నట్లు సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. మాస్టర్ ట్రైనర్లుగా ఇల్లెందు సూపర్‌వైజర్ ఎ.కవిత, పాల్వంచ సూపర్‌వైజర్ శారద వ్యవహరించారు. విజయకుమారి, లక్ష్మీకుమారి, జ్యోతి, అన్నపూర్ణ, కొమురమ్మ, జయ, సరిత పాల్గొన్నారు.

యువతకు అన్యాయం చేయొద్దు..



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని, కేంద్రం అనాలోచిత నిర్ణయాలు తీసుకొని రాష్ట్రంలోని యువతకు అన్యాయం చేయొద్దని ఐక్య వేదిక నాయకులు తాండ్ర వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల కాంట్రాక్టర్లకు వేలంపాటలో గనులు కేటాయిస్తే.. 70 శాతం కార్మికులను వారి రాష్ట్రాల నుంచి నియమించుకుంటారని తెలిపారు. సమావేశంలో నాయకులు కొదమసింహం పాండురంగాచార్యులు, మల్లెల రామనాథం, మోరె భాస్కర్, కురిమిల్ల శంకర్, రాజుగౌడ్, బొంకూరి పరమేశ్, మోహన్, పుష్పరాజ్, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

28న ఆలయ భూముల కౌలు వేలం

పాల్వంచరూరల్: పాత పాల్వంచలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి చింతలచెరువు ఆయకట్టు కింద ఉన్న 2.30 ఎకరాల భూమిని ఏడాది పాటు కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 28న వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం మొదలవుతుందని, ఆసక్తి ఉన్న వారు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు.

27న వారాంతపు సంతకు వేలం

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 27వ తేదీన వారపు సంతకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సంత వేలంపాటలో నిర్ణయించిన ధర దాటనందున 27వ తేదీన మళ్లీ నిర్వహించేందుకు నిర్ణయించినట్లు వివరించారు. వేలంపాటలో పాల్గొనాలనుకునేవారు 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రూ.10 లక్షలు డిపాజిట్ డీడీ, సాలవెన్సీ సర్టిఫికెట్, 6 పోస్ట్ డేటెడ్ చెక్కులు కార్యాలయంలో అందించాలని కమిషనర్ సూచించారు.

కార్మికుల వారసులకు నియామకపత్రాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో పనిచేస్తూ మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన వారే కాక విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుల వారసులు 18 మందికి సోమవారం డిపెండెంట్ నియామకపత్రాలు అందజేశారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని 18 మందికి జీఎం శాలేంరాజు నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. అధికారులు కోటిరెడ్డి, మురళితో పాటు నాయకులు రజాక్, కె.రాములు తదితరులు పాల్గొన్నారు.

సత్యం స్ఫూర్తితో ఉద్యమాలు నిర్మించాలి

సుజాతనగర్: ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన చింతలపూడి సత్యం స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. చింతలపూడి సత్యం 30వ వర్ధంతి సభను ఆ పార్టీ ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీ రేట్ల పెంపు కోసం సత్యం మొక్కవోని దీక్షతో కృషి చేశాడని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, కున్సోత్ ధర్మ, నర్రా శివరామకృష్ణ, గండమాల భాస్కర్, శంకర్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

ఇల్లెందు: ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ద్వారా పట్టణంలోని నిరుద్యోగ యువతకు టూ వీలర్ మెకానిక్ కోర్సులో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ తాటి మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల లోపు అభ్యర్థులు 99890 25236 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

సింగరేణి(కొత్తగూడెం): ఎన్టీఏను రద్దు చేయాలని, నీట్ అవకతవకలపై సుప్రీం కోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారాన్ని రాష్ట్రాలకే వదిలేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం విద్యార్థి, యువజన, సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి అంబేడ్కర్ (పోస్టాఫీస్) సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఫహీమ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కంపాటి పృథ్వీ మాట్లాడారు. ప్రవేశ పరీక్షల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాలు ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేవని పేర్కొన్నారు. నీట్, సీయూఈటీ, యూజీసీ, నెట్, సీఎస్ఐఆర్, కంబైన్డ్ యూజీసీ నెట్ వంటి పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బయ్యా అభిమన్యు, మందా నాగకృష్ణ, జిమ్మి యశ్వంత్, రామ్‌చరణ్, లిక్కి బాలరాజు, సాగర్, రనధీర్, ఖయ్యూం, గణేశ్, యనగంటి వంశీ, నరేందర్, శివ, సాయి, బాలాజీ, లావణ్య, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలి..



విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని నిరుద్యోగ యువత విజ్ఞాన కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఏరియా సేవా అధ్యక్షురాలు మధురవాణి అన్నారు. సోమవారం ఏరియా పరిధిలోని రుద్రంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన స్టడీ సెంటర్ (ప్రొఫెసర్ జయశంకర్ విజ్ఞాన కేంద్రం)ను జీఎం శాలేంరాజు ఆధ్వర్యంలో ప్రారంభించగా మధురవాణి మాట్లాడారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న వివిధ నోటిఫికేషన్లకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు ఈ కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, పుస్తకాల్లోని విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకొని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం జీఎం మాట్లాడారు. కార్యక్రమంలో కోటిరెడ్డి, ఎండీ రజాక్, వి.మల్లికార్జున్‌రావు, పీఓలు మురళి, జి.సంఘమిత్ర, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు, సాగర్, అనిత పాల్గొన్నారు.

సత్సంబంధాలు మెరుగుపడాలి



కేక్ కట్ చేస్తున్న జీఎం జాన్‌ఆనంద్, నిమ్మి ఆనంద్

ఇల్లెందు: సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కుటుంబాల మధ్య సత్సంబంధాలు బలపడాలని ఏరియా జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. సోమవారం ఇల్లెందు సీఈఆర్ క్లబ్‌లో ఘనంగా ఫ్యామిలీడే వేడుకలు నిర్వహించగా ఆయన మాట్లాడారు. ఇల్లెందు ప్రాంతంలో మునుపెన్నడూ లేనంతగా ఆహ్లాదంగా ఉత్సవాలు జరుపుకోవటం ఆనందంగా ఉందన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రతీ ఉద్యోగికి బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్, ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, సెక్రెటరీ మల్లారపు మణి, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సీఈఆర్ క్లబ్ సభ్యులు సుధాకర్, నజీర్ అహ్మద్, జె.వెంకటేశ్వర్లు, సుందర్, వెంకటేశ్వర్లు, ఇంతియాజ్, ఫరీద్ పాల్గొన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ చరిత్రాత్మకం



రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: రాష్ట్రంలో రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం చరిత్రాత్మకమని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని జగన్నాథపురంలో సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించి రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల సమయాన ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తోందని తెలిపారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు జాలే జానకీరెడ్డి, కొండం వెంకన్న, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సాధం రామకృష్ణ, కాపర్తి వెంకటాచారి, బత్తుల వెంకటేశ్వరరావు, చింత నాగరాజు, మోహన్‌రావు, పాపారావు, వెంకటేశ్వరరావు, మధు, సుందర్‌రెడ్డి, పాషా, అనిత, ఉషారాణి, పుల్లయ్య, నందనాయక్, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.